# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 352 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 28 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## బిజాపూర్‌లో భీకర ఎన్‌కౌంటర్

2లో..

ఆరుగురు మావోయిస్టులు మృతి

# ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలి

### సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వై చంద్రచూడ్

### తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూమి పూజ

హైదరాబాద్, మార్చి 27(ప్రభాత ఉదయం) ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వై చంద్రచూడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ ( రాజేంద్రనగర్)లో తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్,హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి భూమి పూజ చేసారు. అనంతరం 32 ఈ సేవా కేంద్రాలను వర్చువల్ కార్యక్రమము ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జస్టిస్ చంద్ర చూడు మాట్లాడుతూ ...ఉద్యాన విశ్వవిద్యాలయాల నుంచి 100 ఎకరాల భూమిని తెలంగాణ హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం అభినందించదగ్గ విషయమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను ప్రత్యేకంగా అభినందించారు. న్యాయ

..మిగతా 2లో



హైకోర్టు భవన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వై చంద్రచూడ్



# బీఆర్ఎస్‌కు మూడవస్థానమే

### రేవంత్ పాలన పట్ల ప్రజల్లో ఆనందం ఉంది

పార్టీలో కేసీఆర్ కుటుంబమే కనిపించింది

రాజకీయాల్లో నీచమైన బాష బిఆర్ఎస్‌తోనే ప్రారంభం

కాళేశ్వరంలో కేసీఆర్‌ది అనవసర జోక్యం

నామాట ఎప్పుడూ పట్టించుకోలేదు

బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, రాజ్యసభ సభ్యుడు కేకే సంచలన వ్యాఖ్యలు

2

# దానం నాగేందర్‌పై హైకోర్టులో మరో పిటిషన్

### అనర్హత వేటు వేయాలంటూ పిటిషన్

### ఎంపీ ఎన్నికల వేళ షాక్ తప్పదా..?





హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికల వేళ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు షాక్ తగిలేలా ఉంది. దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనపై అనర్హత వేటు

..మిగతా 2లో

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్

### అరెస్టులపై హరీష్ ఆఫీస్ వివరణ



హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): కష్టకాలంలో ఉన్న ప్రజలకు అందాల్సిన చెక్స్ పక్కదారి పట్టాయి. ఇందులో మాజీ మంత్రి హరీష్‌రావు వ్యక్తిగత సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణలో మరో కేసు సంచలనంగా

..మిగతా 2లో



# హైకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

### పిటిషన్‌పై వాడీవేడిగా వాదనలు

న్యూఢిల్లీ, మార్చి 27 (ప్రభాత ఉదయం): మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు దిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరువర్గాలకు చెందిన న్యాయవాదుల మధ్య వాడీవేడిగా వాదనలు కొనసాగాయి. అలాగే, కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈడీ అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై ఏప్రిల్ 2 లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు,

..మిగతా 2లో

# తెలంగాణ టెట్‌కు దరఖాస్తులు షురూ

హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్ https://tstet2024.aptonline.in/tstetలో దరఖాస్తు చేసుకోవచ్చు. షెడ్యూల్ ప్రకారం.. ఆన్‌లైన్ ఆధారిత టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3 మధ్య రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకుబీ అలాగే, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటాయి. మే 15 నుంచి హాల్‌టికెట్లు అందుబాటులోకి వస్తాయి. టెట్ ఫలితాలు జూన్ 12న విడుదల చేస్తారు. టెట్ ఒక పేపర్ రాసేందుకు రూ.1000, రెండు పేపర్లు రాసేందుకు రూ.2వేలు చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. టెట్ పేపర్-1 రాసేందుకు డీఈడీ, పేపర్-2 రాసేందుకు డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలి. సర్వీస్ టీచర్లు సైతం టెట్ రాయొచ్చు. ఈ పరీక్షకు విద్యార్హతలు, ఇతర పూర్తి వివరాలను ఈ కింది పీడీఎఫ్‌లో తెలుసుకోవచ్చు.



# వీహెచ్‌కు సీఎం రేవంత్ బుజ్జగింపులు



### ఎంపీ సీటు ఇవ్వకపోయినా కీలక హామీ కేబినెట్ హెూదాతో పదవి ?

హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ వి. హనుమంతరావు ఎప్పుడూ ఏదో రకంగా ఆయన వార్తల్లో నిలుస్తూ ఉంటారు. ప్రతిపక్షాలతో పాటు సొంత పార్టీ నేతలపై కూడా విమర్శలు చేసి హాట్ టాఫిక్‌గా మారుతారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాను కూడా సీఎం రేసులో ఉన్నానని.. ప్రచారం చేసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. రేవంత్ ముఖ్యమంత్రి కాగా.. ఆయనకు ప్రభుత్వంలో కీలక పదవి వస్తుందని ఆశించారు. అయితే ఆయనకు ఎలాంటి పదవి కట్టబెట్టలేదు. రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగినా.. తెలంగాణ కోటాలో అనిల్ కుమార్ యాదవ్‌ను

..మిగతా 2లో



# చేవెళ్లలో 13న కేసీఆర్ బహిరంగ సభ

### చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక సమావేశం

హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంలో ప్రస్తావించాల్సిన అంశాలపై రోజుకో నియోజకవర్గం నేతలతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నేతలతో సమావేశమయ్యారు. గత ఎన్నికల్లో చేవెళ్ల నుంచి విజయం సాధించిన రంజిత్ రెడ్డి ఈ మధ్య కాలంలోనే కాంగ్రెస్‌లో చేరారు. దీనిపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ వీడిపోతున్న వారిని, ముఖ్యంగా ఎంపీ రంజిత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రవ విమర్శలు చేశారు. ఆయన ఏమన్నారంటే...” రంజిత్ రెడ్డి ఎవరో మన పార్టీ సీటు ఇచ్చి, గెలిపించుకున్న తర్వాతే ప్రపంచానికి తెలిసింది. 2019లో రాజకీయాలకు కొత్త అయినా పార్టీలో ఉన్న, ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి ఆయనను గెలిపించారు. రంజిత్ రెడ్డికి రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యత కూడా ఇచ్చాము. నియోజక వర్గంలో

..మిగతా 2లో

# బీఆర్ఎస్‌కు మూడవస్థానమే

హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్, బీజేపీకే ఎక్కువ సీట్లు వస్తాయని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, రాజ్యసభ సభ్యుడు కేకే సంచలన వ్యాఖ్యలు చేశారు. మొన్న ఓడిపోయాం కాబట్టి ఈసారి మా పార్టీకి అంత బలం లేదని, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మాకంటే ముందు వరుసలో కాంగ్రెస్, బీజేపీలు ఉంటాయన్నారు. అయితే ఫస్ట్, సెకండ్ ప్లేస్ లో ఎవరు ఉంటారనేది చెప్పడం కష్టం అన్న కేకే.. ఈ ఎన్నికల్లో క్యాండిటేడ్ ప్రయార్టీ కాబోతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి పాలన పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత కనిపంచలేదన్నారు. అలాగే మోడీ ఓటు వేస్తామని కూడా ప్రజలు చెబుతున్నారన్నారు. తానిచ్చిన ఇన్ పుట్స్ ను కేసీఆర్ సీరియస్ గా తీసుకోలేదని, బీఆర్ఎస్ కుటుంబ పార్టీగా మారిందనేది నిజమే అన్నారు. ప్రభుత్వంలో, బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో కేసీఆర్ తర్వాత కేటీఆర్, హరీశ్ రావు, కవిత మాత్రమే కనిపించారని మిగతా నాయకులు కనిపించలేదన్నారు. పార్టీ మారిన లీడర్లను ప్రజలు చెప్పుతో కొట్టాలన్న పిలుపును ఎవరు కేర్ చేయరన్నారు. ఎవరైనా పార్టీ మారాలనుకునే వారు తమ పదవులకు రాజీనామా చేయడం నైతికంగా, రాజకీయ బాధ్యత అన్నారు. గతంలో ఈ విషయంలో బీఆర్ఎస్ తప్పు చేసిందని తాను ఓపెన్ గానే చెప్పానన్నారు. ప్రస్తుత రాజకీయకులు మాట్లాడుతున్న నీచమైన బాష గత 60 ఏళ్లలో ఎప్పుడూ వినలేదు అన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాతే వింటున్నానన్నారు. మీరందరు అనుకున్నట్లుగా నా దృష్టిలో కేసీఆర్ అవినీతి పరుడు కాదని తన జేబులో ఏదైనా ఉంటే దానిని తన స్నేహితుడికి ఇచ్చే క్యారెక్టర్ కేసీఆర్ దన్నారు. ఏ ప్రభుత్వం అయినా అవినీతికి పాల్పడితే తప్పకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ అవినీతిలో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఉంటే ఉండవచ్చు ఆ విషయం నాకు తెలియదన్నారు. లికాళేశ్వరం విషయంలో కేసీఆర్ అన్ నెససరీ డిజైన్ ఇచ్చారు.ఆ పని నిపుణులు చేయాల్సిందన్నారు. తనను దీపాదాస్ మున్షీ కలవడం సాధారణ విషయమే అని.. పార్టీ మారాలనుకున్న లినా కూతురు నిర్ణయం నాకెలా తెలుస్తుందన్నారు.





## మల్కాజిగిరిలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది

### టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు

కూకట్‌పల్లి,మార్చి27 (ప్రభాత ఉదయం): తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమం 7 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ మరియు కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే అండగా నిలబడ్డారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎవరైతే తోడుగా ఉంటారో వారిని ఎప్పటికీ మర్చిపోమని, తిరిగి మళ్ళీ అఖండ మెజారిటీతో బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాబోతుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తనకు ఆరోగ్యం సహకరించకున్నా మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్న ఉద్దేశంతో సంకల్పించుకున్నానని, అలాగే బిఆర్ఎస్ పార్టీలో జరిగిన అభివృద్ధి కళ్ళ ముందు కనబడుతుందని, నేడు కనీసం ఎవరితో మాట్లాడినా కూడా ఇతర పార్టీలోకి వెళ్తున్నారన్న గుసగుసలు వినబడటం ఎంతో బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఏడు నియోజకవర్గాల్లో అందరూ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు కృషి చేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



## ఘనంగా సినీ నటుడు రాంచరణ్ జన్మదిన వేడుకలు

### పాల్గొన్న జనసేన కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి,మార్చి27 (ప్రభాత ఉదయం) మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ 39వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో అఖిల భారత రామ్ చరణ్ యువత అరవింద్ చెర్రీ , సందీప్ ధనపాల ఆధ్వర్యంలో రక్త దానం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ యువకులు రక్తదానం చేయడమంటే ప్రాణం దానం చేయడమేనని, నేటి యువత మానవతా దృక్పథంతో సమాజంలో సేవా కార్యక్రమాలలో పాల్గొనడం గర్వించదగ్గ విషయమని, ప్రజల ప్రాణాలు కాపాడుకోవడం కొరకు రక్తదానమనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చిన మెగాస్టార్ చిరంజీవి, చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వార దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న మెగా అభిమానులను ప్రోత్సహిస్తున్న ఫ్యాన్స్ అధ్యక్షుడు రవణం స్వామి నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ రాంబాబు, ఘట్టో రాంబాబు మరియు కొల్లా శంకర్, పి.సుభాష్, షణ్ముఖ, నూతి రాంబాబు, పులగం సుబ్బు, మధుసూధన్ రెడ్డి, సుధాకర్, నవీన్, అంజి, అభిమానులు పాల్గొన్నారు.



హైకోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం లో పాల్గొన్న న్యాయవాదులు

## రాజేంద్రనగర్‌లో హైకోర్టు ఏర్పాటు చేయడం సంతోషకరం: యువ న్యాయవాదులు

రాజేంద్రనగర్, మార్చి 37(ప్రభాత ఉదయం) తెలంగాణ హైకోర్టు భవనం రాజేంద్రనగర్ లో ఏర్పాటు చేయటం సంతోషకరమని యువ న్యాయవాదులు కోరని క్రాంతి అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో నూతనంగా నిర్మిస్తున్న హైకోర్టు భవన భూమి పూజా కార్యక్రమం లో న్యాయవాదులు పాల్గొన్నారు.



## చేవెళ్లలో 13న కేసీఆర్ బహిరంగ సభ

మొదటి పేజీ తరువాయి...

స్వేచ్ఛ ఇచ్చాం. ఈ ఎన్నికల్లో పోటీ చేయను అని పార్టీ ముందు అశక్తతను వ్యక్త్యం చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటాను అని చెప్పి, కేవలం అధికారం, ఆస్తుల కోసమే రంజిత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీని విడిచి ద్రోహం చేశారు. పార్టీ సీనియర్ నాయకురాలు తన సోదరి అని చెప్పుకుని కవితపైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాల పేరుతో దాడి చేసి అరెస్టు చేసిన రోజే.. రంజిత్ రెడ్డి నవ్వుకుంటు పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులే కాదు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు కూడా రంజిత్ రెడ్డికి పార్టీ ఏం తక్కువ చేసిందని, పార్టీకి మోసం చేసి వెళ్ళారని చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కూడా పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని ఇతర పార్టీలోకి వెళితే ఫలితం ఏమైందో అందరికీ తెలుసు. పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరు. అదే నిజమైతే దేశంలో పార్టీలు ఉండవు. స్వతంత్ర అభ్యర్థులే గెలుస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి మనుసులు కలిసినంత మాత్రాన మిలాఖత్ అయినంత మాత్రనా.. కాంగ్రెస్ బిఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. ఎంపీ ఎలక్షన్‌లపై కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన అయోమయం నెలకొని ఉంది. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకలేదు. సొంతంగా అభ్యర్థి లేని కాంగ్రెస్ పార్టీ, చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో గెలవడం అసాధ్యం. చేవెళ్ల నియోజకవర్గంలో 13న కెసిఆర్ బహిరంగ సభ ఉంటుంది. సామాజిక సమీకరణాల రీత్యా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు సులభం అవుతుంది. అని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజులతోపాటు బీసీల కోసం కొన్ని దశాబ్దాలుగా అండగా నిలబడిన వ్యక్తి అని అన్నారు. ఒకవైపు బీసీల కోసం పాటుపడుతూనే, మరోవైపు అన్ని సామాజిక వర్గాలను, మైనార్టీలను కలుపుకుపోయిన మంచి మనిషి, నాయకుడు కాసాని అంటు కితాబు ఇచ్చారు.

## దానం నాగేందర్‌పై హైకోర్టులో మరో పిటిషన్

మొదటి పేజీ తరువాయి...

వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలంటూ నగరానికి చెందిన రాజు యాదవ్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలుపొందిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరటంతో పాటు ఆ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారని చెప్పారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తన పదవికి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయడం చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ మేరకు దానంపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరాడు. కాగా ఈ పిటిషన్ మార్చి 28 విచారణకు వచ్చే ఛాన్స్ ఉంది. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండు వారాల క్రితం కారు పార్టీకి షాక్ ఇస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన రెండ్రోజులకే దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇక్కడి నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పోటీ చేస్తుండగా.. బలమైన అభ్యర్థిని దింపాలనే యోచనలో బీసీ సామాజిక వర్గానికి చెందిన దానంను కాంగ్రెస్ బరిలోకి దింపుతోంది. బీఆర్ఎస్ నుంచి సికింద్రాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ పోటీ చేస్తున్నారు. కాగా, ఆయన పార్టీ మారటంపై ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని.. దానంపై అనర్హత వేటు వేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలోని బృందం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఇష్యూ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే.. తాజాగా మరో వ్యక్తి దానంపై ఫిర్యాదు చేయటం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా.. దానం నాగేందర్‌కు మరో కేసులో హైకోర్టు ఇది వరకే నోటీసులు జారీ చేసింది. దానం ఎన్నిక చెల్లదంటూ ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ జరిపింది. జస్టిస్ విజయసేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. దీనిపై దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఓటర్లకు డబ్బులు పంచారని, ఈ విషయంలో కేసులు కూడా నమోదయ్యాయని కోర్టుకు వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం దానంకు నోటీసులు జారీ చేసింది. ఇలా పార్లమెంట్ ఎన్నికల వేళ దానంకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు కాగా.. అనర్హత వేటు వేసేలా హైకోర్టు స్పీకర్‌ను ఆదేశిస్తుందా ? అనేది హాట్ టాఫిక్‌గా మారింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల గోల్‌మాల్

మొదటి పేజీ తరువాయి...

మారుబోతోంది. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్స్‌లో గోల్‌మాల్ జరిగిందని కేసు రిజిస్టర్ అయింది. ఇందులో మాజీ మంత్రి హరీష్‌రావు వ్యక్తిగత సిబ్బంది అరెస్టు కావడం కేసులో కీలకంగా మారుతోంది. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నలుగుర్ని అరెస్టు చేశారు. వారిలో హరీష్‌రావు పీఏ నరేష్ ఉన్నాడు. జరుగుతున్న ప్రచారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కార్యాలయం స్పందించింది. “హరీష్ రావు పీఏ సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాజేసిండు అనే వార్తతో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం. వాస్తవం ఏమిటంటే నరేష్ అనే వ్యక్తి హరీశ్ రావు వద్ద పీఏ కాదు. అతను ఒక కంప్యూటర్ ఆపరేటర్‌గా, తాత్కాలిక ఉద్యోగిగా హరీశ్ రావు కార్యాలయంలో పని చేసే వారు. ఆర్థిక, ఆరోగ్య మంత్రిగా పదవీకాలం పూర్తైన తర్వాత, ప్రభుత్వ ఆదేశాలు లేఖ నం. 2290 తేదీ 05-12-2023 ఆదేశాల ప్రకారం, ఆ ఆఫీస్‌ను తర్వాత రోజు 06-12-2023 రోజున మూసివేసి, సిబ్బందిని పంపేశాం. ఆ రోజు నుంచి నరేష్ అనే వ్యక్తితో హరీశ్ రావు కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు. అయితే ఆఫీసు మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం లేకుండా కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై వెంటనే మా కార్యాలయం స్పందించి, నరేష్ అనే వ్యక్తిపై 17-12-2023 నాడు, నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. చట్ట ప్రకారం, తగు చర్యలు తీసుకోవాలని కోరాం. కాబట్టి, ఆ వ్యక్తితో హరీశ్ రావుకి గానీ, కార్యాలయానికి గాని ఎలాంటి సంబంధం లేదు. ఈ వాస్తవాలు గుర్తించకుండా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పును, మొత్తం కార్యాలయానికి వర్తింపచేయడం బాధాకరం. ఎంతో మంది అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మా కార్యాలయం సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాకుండా, ఎన్నో విధాలుగా సహాయంపడింది. ఈ విషయం అందరికి తెలిసిందే. వాస్తవాలు గుర్తించాలని కోరుతున్నాం.” అంటూ ప్రకటన రిలీజ్ చేశారు.

## వీహెచ్‌కు సీఎం రేవంత్ బుజ్జగింపులు

మొదటి పేజీ తరువాయి...

పెద్దల సభకు పంపారు. ఆ తర్వాత ఖమ్మం పార్లమెంట్ సీటు ఆశిచంగా.. ఆ స్థానానికి విపరీతమైన పోటీ ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి కూడా పోటీ పడుతున్నారు. తాను కూడా పోటీలోనే ఉన్నానని మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తనయుడు యుగంధర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ సీటు హనుమంతరావుకు కష్టమేనని పార్టీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో వీహెచ్ అలకబూనారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఇటీవల కీలక కామెంట్స్ చేశారు. ఇతర పార్టీలకు చెందిన నేతల ఇళ్లకు రేవంత్ వెళ్లటంపై ఆక్షేపించారు. రేవంత్ తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నాడని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టిన వారిని ఇప్పుడు జాయిన్ చేసుకుంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డితో మాట్లాడుదామంటే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో వీహెచ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి రేవంత్ ఇంటికి వెళ్లారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై నేతలు చర్చించారు. బుజ్జగింపుల తర్వాత వి.హనుమంతరావు మెత్తబడినట్లు తెలిసింది. వీహెచ్‌కు అన్నివిధాలా అండగా ఉంటానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్ హోదాతో వీహెచ్‌కు ఏదైనా నామినేటెడ్ పోస్టు కట్టబెట్టే యోచనలో రేవంత్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

## బిజాపూర్‌లో భీకర ఎన్‌కౌంటర్

### ఆరుగురు మావోయిస్టులు మృతి

బిజాపూర్, మార్చి 27 (ప్రభాత ఉదయం): కంచుకోట బస్తర్ అటవీ ప్రాంతంలో మావోయిస్ట్‌లకు మరోసారి షాక్ తగిలింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అణవణువునా జల్లెడ పడుతున్నాయి భద్రతా బలగాలు. ఈ క్రమంలో బిజాపూర్ అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. తారసపడిన మావోలతో భద్రతా బలగ్గాలకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఆరుగురు నక్సల్స్ హతమైనట్టు పోలీసులు తెలిపారు. అయితే, భద్రతా సిబ్బంది ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనేది మాత్రం పోలీస్ అదికారులు ఇప్పటి వరకూ వెల్లడించలేదు. మావోయిస్ట్‌లకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు నక్సలైట్లు హతమయ్యారు. బుధవారం తెల్లవారుజామున బిజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా నక్సలైట్ సహా ఆరుగురు హతమైనట్టు పోలీస్ అధికారులు వెల్లడించారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చికురుభట్టి, పుసబాక గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. యాంటీ-నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురుపడిన మావోయిస్ట్‌లు కాల్పులు జరిపినట్టు బస్తర్ రేంజ్ ఐటీ పి. సుందరరాజన్ తెలిపారు. డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డ్ (డీఆర్జీ), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), కోబ్రా ఎలైట్ యూనిట్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టిందని చెప్పారు. మావోయిస్ట్‌ల దాడిని భద్రతా బలగాలు తిప్పికొట్టాయని, ఎన్‌కౌంటర్ ప్రాంతంలో ఆరు మృతదేహాలను బుధవారం ఉదయం స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వీరిలో ఓ మహిళా నక్సలైట్ కూడా ఉన్నట్టు ఐజీ వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతోందని అన్నారు. హతమైన నక్సల్స్‌లో దళ కార్యదర్శి నగేశ్, ఆయన భార్య ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, బిజాపూర్ జిల్లాలోని లోక్‌సభ స్థానాలకు తొలి దశలో ఏప్రిల్ 19 ఎన్నికలు జరగనున్నాయి. దేశంలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఒకటైన బీజాపూర్.. మావోయిస్ట్‌లకు కంచుకోట. అక్కడ కీకారణ్యాలు మావోలకు వరంగా మారాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా భద్రతా బలగాలతో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. నక్సల్స్ ఏరివేత కోసం అడవుల్లో జల్లెడ పడుతున్నారు. అటు, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెూలీ రోజున ముగ్గురు పౌరులను మావోయిస్ట్‌లు హత్యచేశారు.

## హైకోర్టులో కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

మొదటి పేజీ తరువాయి...

కేజ్రీవాల్ తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈడీ తనను అరెస్టు చేయడం ద్వారా మానవ హక్కుల్ని ఉల్లంఘించిందని కేజ్రీవాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. నేరాన్ని నిర్ధారించడంలో ఈడీ విఫలమైందన్న ఆయన.. విచారణ లేకుండా అరెస్టు చేయడం రాజకీయ ప్రేరేపితంగా కనిపిస్తోందని తెలిపారు. వెంటనే జైలు నుంచి విడుదల చేసి తనకు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్ విచారణ నేపథ్యంలో ఏఎస్‌జీ ఎస్వీరాజు స్పందిస్తూ పిటిషన్‌కు సంబంధించిన దస్త్రం తమకు నిన్ననే అందిందని.. అందువల్ల దీనిపై స్పందించేందుకు మూడు వారాల సమయం కావాలని కోరారు. దీన్ని సింఘ్వీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈడీ అధికారులు ఆలస్యం చేసే వ్యూహాలను పన్నుతున్నారని ఆరోపించారు. మూడు వారాల గడువు అడగడం దారుణమని.. ఒక సిట్టింగ్ సీఎంను అరెస్టు చేసిన వారి ఉద్దేశమే భిన్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి అంతరాయం కలిగించేందుకే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్న ఆప్ వాదనను సింఘ్వీ కోర్టు ముందుంచారు. మద్యం విధానం కేసులో ఈనెల 23న రాత్రి కేజ్రీవాల్ అరెస్టు కాగా.. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈనెల 28 మధ్యాహ్నంతో ఈడీ కస్టడీ ముగినుండటంతో ఆయన్ను గురువారం రౌస్ అవెన్యూకోర్టులో హాజరుపరచనున్నారు. అయితే, ఈడీ అధికారులు ఆయనను మరికొన్ని రోజుల పాటు తమ కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలి

మొదటి పేజీ తరువాయి...

ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి, సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇది ఆధునిక సాంకేతికత , మౌలిక సదుపాయాలను కలిగి ఉండేలా నిర్మించుకోవడానికి కేటాయించడం, కోర్టు గదులు, న్యాయమూర్తుల గదులు, పరిపాలనా కార్యాలయాలు, లైబ్రరీలు ఇతర సహాయక సేవలతో సహా హైకోర్టుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి కొత్త కాంప్లెక్స్ రూపొందించుకోవడం, అడ్మిన్ స్టేషన్, న్యాయమూర్తులకు వసతులు కల్పించేలా నిర్మించుకోవడం అద్భుత కట్టడం మిగిలిపోతుంది అన్నారు. అత్యున్నత స్థాయిలో ఉన్న న్యాయస్థానాలు, కనీస వసతులు లేని నిర్బంధంలో ఉన్నాయని, నేటితో తెలంగాణ హైకోర్టు నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా న్యాయస్థానాలు రూపుదిద్దుకోబోతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ పివి సంజయ్ కుమార్, జస్టిస్ ఎస్ విభట్టి, ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డిజిపి రవి గుప్త, జిల్లా కలెక్టర్ శశాంక తదితర అధికారులు, జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.



హైకోర్టు భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న జస్టిస్ చంద్ర చూడ్



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డిజిపి రవి గుప్త,

# ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలి

## జలమండలి మేనేజర్ వినాయక్



అత్తాపూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తున్న మేనేజర్ వినాయక్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు,న్న ఉపాధ్యాయురాలు

రాజేంద్రనగర్, మార్చి 27(ప్రభాత ఉదయం) ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టుకోవాలని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ అత్తాపూర్ సెక్షన్ మేనేజర్ వినాయక్ ప్రజలను కోరారు. బుధవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నీటి సంరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వాటి వల్ల చేకూరే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా వినాయక మాట్లాడుతూ... ప్రభుత్వం నగర ప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో జలమండలి నేతృత్వంలో సుదూర ప్రాంతాల నుండి నీటిని పైప్లైన్ ద్వారా తీసుకువచ్చి శుద్ధిచేసి ఇంటింటికి సరఫరా చేస్తుందన్నారు. కోట్లాది రూపాయల తో వెచ్చించి సరఫరా చేస్తున్న శుద్ధి నీటిని ప్రజలు వృధా చేయకుండా సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటిని సంరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలకు మనుగడ ఉండదని ఆయన పేర్కొన్నారు.



# బిజెపిని గెలిపిస్తేనే దేశం సురక్షితంగా ఉంటుంది

### చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఆయన సతీమణి సంగీతారెడ్డి

శంషాబాద్,మార్చి 27, (ప్రభాత ఉదయం) భారతదేశం సురక్షితంగా ఉండాలంటే దేశానికి చౌకీదారుగా ఉన్న నరేంద్ర మోడీని గెలిపించాలని చేవెళ్ల పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండ సంగీత రెడ్డి సూచించారు. భారతీయ జనతా పార్టీ చేవెళ్ళ లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా సంగీతా రెడ్డి బుధవారం శంషాబాద్ లోని ముచ్చింతల్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి గడపగడపకు వెళ్లి భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరించారు. వీధులలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మహిళలు చిరు వ్యాపారులను ఆమె కలిసి కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు అందిస్తున్న రుణాల గురించి వివరించారు. కమలం గుర్తుపై ఓటు వేసి బిజెపిని గెలిపించాలని సూచించారు.. ఇవి లోక్‌సభ ఎన్నికలు అని దేశాన్ని భద్రంగా కాపాడే వారిని బలపరచాలని. ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కొండా విశ్వేశ్వర రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. వీధులలోని మహిళలు ఆమెతో పాటు అడుగులో అడుగు వేశారు. జై బీజేపీ జై నరేంద్ర మోడీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య. ముచ్చింతల సర్పంచ్ వడ్డే సుజాత. మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్య. మాజీ ఎంపీటీసీ వడ్డే చంద్రయ్య. పెద్ద తూప్రా మాజీ ఎంపీటీసీ యాదయ్య.బిజెపి నాయకులు గండు రాజు. ప్రమోద్ బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రెవరెండ్ కె. సుందర్ పాల్ జన్మదిన వేడుకలు

బుద్వేల్, మార్చి27(ప్రభాత ఉదయం) : అత్తాపూర్ రాక్ చర్చ్ పాస్టర్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె. సుందర్ పాల్ జన్మదిన వేడుకలు బుధవారం అత్తాపూర్ రాక్ చర్చ్ ఆవరణలో ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించారు. సంఘ విశ్వాసులు , బంధువులు రెవరెండ్ కె. సుందర్ పాల్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



రెవరెండ్ కె సుందర్ పాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్

### రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ ఆధ్వర్యంలో

దుర్గా నగర్ ఎలోహిమ్ గాస్పెల్ చర్చ్ పాస్టర్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్ ఆధ్వర్యంలో రెవరెండ్ కె. సుందర్ పాల్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. సుందర్ పాల్ ను సన్మానించి, ఆయనకు పుష్ప గుచ్ఛం అందచేసి కేక్ కట్ చేయించారు. రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వహణలో సుందర్ పాల్ ఎంతో చక్కగా పనిచేస్తున్నారని కొనియాడారు. రెవరెండ్ కె. సుందర్ పాల్ కు రాజేంద్రనగర్ మండలం పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు , గవర్నింగ్ బాడీ సభ్యులు, స్నేహితులు, బంధువులు, విశ్వాసులు ఫోన్ లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



# రంజిత్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఆల్విన్ కాలనీ యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

కూకట్‌పల్లి,మార్చి27 (ప్రభాత ఉదయం): చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని ఆల్విన్ కాలనీ 124 డివిజన్ నుండి ముఖ్య నాయకులు, మరియు క్రిస్టియన్ సోదరులు మర్యాదపూర్వకంగా కలిసి రానున్న పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపిస్తామని మద్దతు తెలియచేస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, మల్లేష్, ఇశ్రాయిల్, సత్యరాజు, శామ్యూల్, నాగభూషణం, ఫరూఖ్, నాగరాజు, కేబుల్ సాయి, ఖలీమ్, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట, కోడి పందాలు ఆడే వారిపై చట్ట ప్రకారం చర్యలు

### పబ్లిక్‌లో న్యూసెన్స్ చేసే వారిపై, ఓపెన్ డ్రింకింగ్ (మధ్యం) చేసే వారిపై కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ రితిరాజ్



గద్వాల,మార్చి27(ప్రభాత ఉదయం) జిల్లాలో పేకాట, కోడి పందాలు ఆడే వారి పై, పబ్లిక్ లో ఓపెన్ డ్రింకింగ్ (మధ్యం) త్రాగే వారి పై, పబ్లిక్ లో న్యూసెన్స్ చేసే వారి పై కఠినంగా వ్యవహరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. సెక్షన్9(%ఱఱ%) గేమింగ్ యాక్ట్- 1974 ప్రకారం కోడి పందాలు ఆడటం, సెక్షన్ 9( %ఱ) , ౦వష 3ఢ%4 సెక్షన్ ల %ఞ% గేమింగ్ యాక్ట్-1974 ప్రకారం పేకాట ఆడటం చట్టరీత్య నేరమన్నారు. జిల్లా లో ఈలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని మరియు పబ్లిక్ లో ఓపెన్ మధ్యం డ్రింకింగ్ చేసే వారు, న్యూసెన్స్ చేసే వారు ఎంతటి వారు అయిన ఉపేక్షించేది లేదని అట్టి వారి పై పోలీస్ వారు కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.



# దేవాలయ నిర్మాణానికి సహకారం అందిస్తా: వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

కూకట్‌పల్లి,మార్చి27 (ప్రభాత ఉదయం): కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ లోని రాజు కాలనీలో ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, దుర్గమాత ఆలయ పునః నిర్మాణ మహోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొని ప్రసన్న ఆంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో బుధవారం దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ఆలయానికి తన వంతు సహకారం అందిస్తాని తెలిపారు. ఆలయ నిర్మాణం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు రమేష్, డివిజన్ కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటసేనా రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు శివరంజని, సూర్య ప్రకాష్ రెడ్డి, చంద్రప్రకాశ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముసిని వెంకటేశ్వర్లు

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27(ప్రభాత ఉదయం) ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని గద్వాల జిల్లా అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముసిని వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం జరగనున్న మహబూబ్ నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముసిని వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం(ఎం.పి.డి. ఓ) లో ఏర్పాటు చేసిన మహబూబ్ నగర్ స్థానిక సంస్థల శాసన మండలి (ఎం.ఎల్.సి) ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక సదుపాయాలతో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేటట్లు చూసుకోవాలన్నారు. జిల్లాలో 225 మంది ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలియజేశారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గం ఇద్దరు శాసన సభ్యులు, ఎం.ఎల్.సి 1 , జెడ్పిటిసి 12, మున్సిపాలిటీల వారిగా గద్వాల్ 37, అయిజ 20, వడ్డేపల్లి 10, అలంపూర్ 10 మంది కౌన్సిలర్లు , ఎం.పి.టి.సి. లు మండలాల వారిగా గద్వాల్ 13, ధరూర్ 12, కేటిదొడ్డి 11, గట్టు 15, మల్దకల్ 13, అలంపూర్ 05 , ఉండవెల్లి 10, అయిజ 15, వడ్డేపల్లి 05 ,ఇటిక్యాల 15, మానవపాడు 09 , రాజోలి 10 మొత్తం 225 మంది ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీ ల పరిధి మార్క్ చేసి బార్కేడింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని , క్యు పద్ధతి పాటించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ కాంతమ్మ, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ నరేష్ పాల్గొన్నారు.



రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మల్లా



రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్



రెవరెండ్ పి స్వర్ణ కుమార్



రెవరెండ్ డాక్టర్ కె. నతానియెల్



రెవరెండ్ కె. సుందర్ పాల్

# ఈ నెల 29న గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

### యేసు క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించనున్న క్రైస్తవ సంఘాలు, విశ్వాసులు

బుద్వేల్, మార్చి27(ప్రభాత ఉదయం) : ఈనెల 29న చర్చీలలో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనలు నిర్వహించడానికి క్రైస్తవ సంఘాలు సన్నా హాలు చేస్తున్నాయి. యేసుప్రభువును సిలువ వేసిన రోజు గా విశ్వసించే గుడ్ ఫ్రైడే కు ముందు 40 రోజులపాటు ఉపవాసం ఉండే క్రైస్తవులు ఈనెల 29న గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహిస్తారు. అందుకోసం చర్చీలను సన్నద్ధం చేస్తున్నారు.

### క్రైస్తవ విశ్వాసుల జీవితాలకు నిత్యజీవం ప్రసాదించిన రోజే గుడ్ ఫ్రైడే : పాస్టర్లు

క్రైస్తవ విశ్వాసుల జీవితాలలో నిత్య జీవాన్ని ప్రసాదించిన రోజుగా గుడ్ ఫ్రైడే ను భావిస్తారని క్రైస్తవ సంఘాల పాస్టర్లు రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మల్ల , రెవరెండ్ సీహెచ్ జాన్ మోజస్ , రెవరెండ్ పి స్వర్ణ కుమార్ , రెవరెండ్ డాక్టర్ కె. నతానియల్, రెవరెండ్ కె సుందర్ పాల్ లు తెలిపారు. 2024 సంవత్సరాలకు పూర్వం ప్రభువైన ఏసుక్రీస్తు లేఖనముల నెరవేర్పు కోసం నరవతారిగా భూలోకానికి వచ్చి ముప్పై మూడున్నర సంవత్సరాలు జీవించి సర్వ మానవాళి పాప పరిహారార్థం కలువరి గిరి లో సిలువపై మరణించి తిరిగి మూడవ దినమున లేచాడని బైబిల్ చెబుతుందన్నారు. ఏసుక్రీస్తు మరణంతో ఆయనను నమ్మే విశ్వాసులందరి జీవితాలకు పరలోక రాజ్యంలో నిత్యజీవం ప్రసాదించబడిందని గుర్తు చేశారు. అందుకే గుడ్ ఫ్రైడే అంటే శుభ శుక్రవారం అని పిలుస్తారని తెలిపారు. ఆ రోజున యేసుప్రభువు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించడం జరుగుతుందన్నారు.

# ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రాం జయంతికి రండి



తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు



బీజేపీ నాయకుడు వి. టి. విజయకుమార్ కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

బుద్వేల్, మార్చి27(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ-2024. ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన ఆరాంఘర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో మాజీ ఉప ప్రధాని, దళిత నేత బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడ సూర్యం తెలిపారు . ఈ ఉత్సవాలకు రావలసిందిగా కోరుతూ తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్, మాజీ పార్లమెంట్ సభ్యులు వి. తులసిరామ్ కుమారుడు బీజేపీ నాయకుడు వి. టి విజయకుమార్ లను బుధవారం కలిసి ఆహ్వాన పత్రికలను అంద చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కె. ఎస్ దయానంద్, నాయకులు పోయిల జీవన్ దాస్, టి.ఆర్.శ్రీరాములు, గోల్కొండ రాజ్ కుమార్, వి. ప్రీతమ్ రాజ్, ఉపేందర్, సుమన్, చంద్రశేకర్, పంబాల రాజు, బాబురావు, రమేశ్, గౌతమ్, తదితరులు ఉన్నారు.

# ఉప్పల్‌లో సిక్సర్ల మోత

## ఐపీఎల్ చరిత్రలో హైదరాబాద్ కొత్త రికార్డు

## ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం

**ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు నమోదు చేసిన ఎస్సార్‌హెచ్.. ముంబైని 31 పరుగుల తేడాతో ఓడించింది. తద్వారా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బోణీ కొట్టింది. సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో లీగ్ చరిత్రలోనే అత్యధికంగా 277/3 నమోదు చేసిన ఎస్ఆర్‌హెచ్.. ముంబై జట్టును 246/5కు కట్టడి చేసింది. ఆది నుంచీ ఎటాకింగ్ గేమ్ ఆడిన ముంబై.. మ్యాచ్‌లో పోరాడి ఓడారు. ముంబైకి ఇది వరుసగా రెండో ఓటమి.**





ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో రికార్డు స్కోరు నమోదు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. 277 పరుగుల స్కోరు చేసినప్పటికీ.. సన్‌రైజర్స్ జట్టుకు విజయం అంత ఈజీగా ఏం దక్కలేదు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ చివరి వరకు పోరాడింది. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే చెలరేగడంతో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేసింది. కానీ చివర్లో పుంజుకున్న సన్‌రైజర్స్ బౌలర్లు ముంబైను 246/5 పరుగులకు కట్టడి చేశారు. దీంతో హైదరాబాద్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై.. ఆది నుంచే బాదుడు మొదలెట్టింది. భువనేశ్వర్ కుమార్ వేసిన తొలి ఓవర్‌లో 9 పరుగులు రాగా.. రెండో ఓవర్ నుంచి అసలు కథ మొదలైంది. ఉనద్కత్ వేసిన ఈ ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత భువనేశ్వర్ కుమార్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ సహా 23 పరుగులు వచ్చాయి. దీంతో మూడు ఓవర్లు ముగిసే సరికే ముంబై స్కోరు 50 పరుగుల మార్కును చేరింది. ఆ తర్వాతి ఓవర్లో షాబాజ్ అహ్మద్.. ఇషాన్ కిషన్‌ను ఔట్ చేయడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. ముంబై బ్యాటర్లు మాత్రం హిట్టింగ్ ఆపలేదు. దీంతో 8 ఓవర్లకే జట్టు స్కోరు 100 పరుగులు దాటింది. ఓ దశలో 11 ఓవర్లకే 150 మార్కు దాటడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. 12 ఓవర్లు ముగిసే సరికి ముంబై 165/3తో నిలిచింది. చివరి 48 బంతుల్లో ఆ జట్టు విజయానికి 113 పరుగులు అవసరం. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా క్రీజులో ఉండటం, టిమ్ డేవిడ్ ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉంటడంతో ముంబై శిబిరంలో విజయంపై ఆశలు చిగురించాయి. కానీ 13వ ఓవర్ నుంచి సన్‌రైజర్స్ బౌలర్లు ఫామ్‌లోకి వచ్చారు. కట్టుదిట్టంగా బంతులేస్తూ.. పరుగులు నియంత్రించారు. దీంతో ఆశించినంత వేగంగా ముంబై పరుగులు రాబట్టలేకపోయింది. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 246/5 పరుగులకు ఆ జట్టు పరిమితమైంది. ముంబై బ్యాటర్లలో రోహిత్ శర్మ 12 బంతుల్లో 26, ఇషాన్ కిషన్ 13 బంతుల్లో 34, నమన్ ధీర్ 14 బంతుల్లో 30, తిలక్ వర్మ 34 బంతుల్లో 64, టిమ్ డేవిడ్ 22 బంతుల్లో 42 రన్స్ స్కోర్ చేశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికంగా 277/3 పరుగులు చేసింది. ఇప్పటిదాకా లీగ్ చరిత్రలో అత్యధిక స్కోరుగా 263/5 ఉంది. 2013లో పూణె వారియర్స్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ ఫీట్ సాధించింది. 11 ఏళ్ల తర్వాత ఆ రికార్డును ఎస్ఆర్‌హెచ్ బద్దలు కొట్టింది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ 24 బంతుల్లో 62 పరుగులు, అభిషేక్ శర్మ 23 బంతుల్లో 63, హెన్రిచ్ క్లాసెన్ 34 బంతుల్లోనే 80 రన్స్ స్కోర్ చేశారు. ఈ మ్యాచ్ విజయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ టోర్నీలో బోణీ కొట్టింది. పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది.





# శివాలెత్తిపోయిన హెడ్..

## 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

ఐపీఎల్ 2024లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఓపెనర్ ట్రవిస్ హెడ్ శివాలెత్తిపోయాడు. కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ తరఫున ఇదే వేగవంతమైన హాఫ్ సెంచరీ. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌పై ఇది రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ. ముంబైపై వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు పాట్ కమిన్స్ పేరిట ఉంది. 2022 సీజన్‌లో కమిన్స్ కేకేఆర్ తరఫున ఆడుతూ ముంబై ఇండియన్స్‌పై 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. 2018 సీజన్‌లో పంత్ (ఢిల్లీ) ముంబైపై 18 బంతుల్లో ఫిఫ్టి పూర్తి చేశాడు. తాజాగా హెడ్.. పంత్ రికార్డును సమం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఓవరాల్‌గా 24 బంతులు ఎదుర్కొన్న హెడ్ 9 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 62 పరుగులు చేసి ఔటయ్యాడు. హెడ్ పేట్రేగిపోవడంతో సన్‌రైజర్స్ పవర్ ప్లేల్లో తమ అత్యధిక స్కోర్‌ను (81/1) నమోదు చేసింది. మరో ఎండ్‌లో అభిషేక్ శర్మ కూడా రెచ్చిపోతున్నాడు. ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో 3 సిక్సర్లు కొట్టిన అభిషేక్.. ఎనిమిదో ఓవర్‌లో వరుసగా రెండు బౌండరీలు బాది జోరుమీదున్నాడు. 8 ఓవర్ల తర్వాత సన్‌రైజర్స్ స్కోర్ 117/2గా ఉంది. అభిషేక్‌తో పాటు మార్క్రమ్ (4) క్రీజ్‌లో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో ముంబై టాస్ గెలిచి సన్‌రైజర్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించి మూల్యం చెల్లించుకుంది.

# పాక్ కెప్టెన్‌గా మళ్లీ బాబర్

## అల్లుడికి అండగా షాహిద్ ఆఫ్రిది



పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తీరును ఆ దేశ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది విమర్శించాడు. బోర్డు పెద్దలు మారినప్పుడల్లా వారికి అనుగుణంగా నిర్ణయాలు మారిపోతూ ఉంటాయని.. తమ క్రికెట్ వ్యవస్థలో ఉన్న అతిపెద్ద సమస్య ఇదేనని పేర్కొన్నాడు. కాగా పీసీబీ యాజమాన్యం తరచూ మారుతున్న విషయం తెలిసిందే. ప్రధాని షాబాజ్ జోక్యం నేపథ్యంలో రమీజ్ రాజాను అధ్యక్షుడిగా తప్పించి.. నజమ్ సేథీని తాత్కాలిక చైర్మన్‌గా నియమించారు. అనంతరం నజమ్ సేథీ కూడా వైదొలగడంతో.. అతడి స్థానంలో జకా అష్రాఫ్ బాధ్యతలు చేపట్టాడు. అతడు కూడా రాజీనామా చేయడంతో సుప్రీం కోర్టు న్యాయవాది షా ఖవార్ నియమితులయ్యారు. తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన పీసీబీ ఎన్నికలు ముగిసే వరకు ఈ పదవిలో కొనసాగుతారని ప్రకటించారు. అనంతరం ఎలక్షన్‌లో గెలిచిన మొహ్సిన్ నఖ్వీ పీసీబీ బాస్ అయ్యాడు. ఇదిలా ఉంటే.. వన్డే వరల్డ్‌కప్-2023లో కనీసం సెమీస్ కూడా చేరుకుండా పాకిస్తాన్ నిష్క్రమించడంతో కెప్టెన్ బాబర్ ఆజంపై వేటు వేశారు. అతడి స్థానంలో టెస్టు కెప్టెన్‌గా షాన్ మసూద్, టీ20 కెప్టెన్‌గా షాహీన్ ఆఫ్రిదిని నియమించారు. అయితే, వీరిద్దరి సారథ్యంలో తొలి సిరీస్‌లలోనే పాకిస్తాన్ ఘోర పరాజయాలు మూటగట్టుకుంది. ఈ క్రమంలో కొత్త సెలక్షన్ కమిటీ బాబర్ ఆజంను తిరిగి కెప్టెన్ చేయాలనే యోచనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టీ20లకు షాహీన్ ఆఫ్రిదిని తప్పించి బాబర్‌తో భర్తీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాలపై స్పందించిన షాహిద్ ఆఫ్రిది.. తన అల్లుడు షాహీన్ ఆఫ్రిదికి అండగా నిలిచాడు. "ఒకరిని కెప్టెన్‌గా నియమించినపుడు తనను తాను నిరూపించుకునేందుకు కొంత సమయం కూడా ఇవ్వాలి. అంతేగానీ కొత్త వాళ్లు రాగానే మళ్లీ మార్పులు చేస్తాం అంటే.. సమస్యలు కొనితెచ్చుకున్నట్లే అవుతుంది. ఒక ఆటగాడిని సారథిని చేసి వెంటనే తొలగించాలనుకుంటున్నారంటే ఆ నిర్ణయం తప్పుడైది ఉండాలి. లేదంటే మళ్లీ మార్చాలనుకున్న నిర్ణయమైన సరైంది కాకపోయి ఉండాలి" అని పీసీబీ తీరును విమర్శించాడు. తన అల్లుడు షాహీన్‌కు మరికొంత సమయం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆఫ్రిది అభిప్రాయపడ్డాడు.

## అనుపమ బాధను

# బయటపెట్టిన సిద్దు

### ట్రోలింగ్‌కు బాధపడిందా?.. అందుకే డుమ్మా కొట్టిందా?




సిద్దు, అనుపమ జంటగా నటించిన టిల్లు స్క్వేర్ సినిమా మార్చి 29న రాబోతోంది. ఈ క్రమంలో బుధవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అయితే ఈ ఈవెంట్‌కు అనుపమ డుమ్మా కొట్టేసింది. అలా అనుపమ రాకపోవడానికి కారణం ఉందని స్టేజ్ మీదే చిన్నగా సిద్దు క్లాస్ పీకేశాడు. టిల్లు స్క్వేర్ విషయంలో మొదటి నుంచి కూడా అనుపమను మెజార్టీ జనం ఇష్టపడటం లేదు. అనుపమ ఏంటి? ఇలాంటి పాత్రలు చేయడం ఏంటి? అని ఆశ్చర్యపోయారు. కొందరు అయితే ఏకంగా అనుపమ మీద తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ వీడియోలు రిలీజ్ చేశారు. మిమ్మల్ని మా ఇంటి పిల్ల అనుకున్నాం.. ఒకప్పుడు ఎలాంటి పాత్రలు చేసేదానివి.. ఇప్పుడు ఎలాంటి పాత్రలు చేస్తున్నావ్ అంటూ హర్ట్ అయ్యారు. నటిగా తాను అన్ని రకాల పాత్రలను చేయాలనుకుంటున్నాను అని అనుపమ తన మీద వస్తున్న విమర్శలకు తెలివిగానే సమాధానం ఇచ్చింది. అయితే అనుపమ మీద మాత్రం టిల్లు స్క్వేర్ విషయంలో ఎక్కువగానే ట్రోలింగ్ కనిపిస్తోంది. రొమాంటిక్ పోస్టర్ల మీద నెట్టింట్లో విమర్శలు వచ్చాయట. ఈ విషయం అనుపమ దృష్టిలో పడింది. దీంతో అనుపమ బాధపడిందట. అందుకే బయటకు వచ్చేందుకు ఇష్టపడలేదట. అందుకే టిల్లు స్క్వేర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి కూడా రాలేదట. ఈ విషయాలన్నీ కూడా ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకలో సిద్దు జొన్నలగడ్డ చెప్పుకొచ్చాడు. ఫ్లర్టింగ్ అనేది అవతలి వాళ్లు ఎంజాయ్ చేసేలా ఉండాలి.. ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు.. అనుపమ కలిసున్న పోస్టర్ విడుదల చేసినప్పుడు.. కొందరు నెగటివ్ కామెంట్స్ రాశారు. అమ్మాయిలను అలా కామెంట్ చేయడం కరెక్ట్ కాదు. ఈ విషయంలో దృష్టిలో పెట్టుకుంటారని ఆశిస్తున్నాను అని కాసింత క్లాస్ పీకాడు సిద్దు. అనంతరం స్టేజ్ మీద డైలాగ్ చెప్పి అందరినీ ఖుషీ చేశాడు. ఇక చివర్లో సుమ స్టెప్పులు వేయమన్నా కూడా వేయలేదు. ఎలాగోలా చివరకు స్టెప్పులు వేశాడు. నువ్వు లేకపోయినా, రాకపోయినా హ్యాండిల్ చేస్తానని అనుపమకు చెప్పాను.. సక్సెస్ మీట్‌కు ఎలాగైనా పట్టుకొస్తా.. అని సిద్దు చెప్పుకొచ్చాడు. ముందు నుంచీ కూడా అనుపమ టిల్లు స్క్వేర్ ప్రమోషన్స్‌లో అంతగా పాల్గొనలేదు. గత వారం నుంచే అనుపమ సిద్దులు కలిసి ప్రమోషన్స్‌లో సందడి చేశారు.



## సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న సిద్దార్థ్-అదితి

ఎట్టకేలకు టాలీవుడ్ హీరో సిద్దార్థ్ పెళ్లి పీటలెక్కాడు. తెలుగు హీరోయిన్ అదితి రావు హైదరిని పెళ్లాడారు. వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురం ఆలయంలో వీరిద్దరి పెళ్లికి జరిగింది. రెండు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహాబంధంలోకి అడుగుపెట్టారు. అదితి, సిద్దార్థ్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన మహా సముద్రం(2021) చిత్రంలో నటించారు. ఆ మూవీ సమయంలోనే వీరిద్దరు ప్రేమలో పడినట్లు తెలుస్తోంది. అయితే ఇన్నాళ్లు ఈ జంటపై వస్తున్న రూమర్స్‌ను నిజం చేస్తూ.. ఒక్కసారిగా వాటన్నింటికీ తెరదించారు. పెళ్లి జరిగిపోవడంతో వీరిద్దరి గురించి అభిమానులు తెగ వెతికేస్తున్నారు.



# పవన్ పిలిస్తే ప్రచారం చేస్తా

## ఆయన గొప్ప లీడర్: యాంకర్ అనసూయ



మెగా అభిమానుల్ని, జన సైనికుల్ని ప్రసన్నం చేసుకునే వార్త చెప్పింది అనసూయ భరద్వాజ్. సొసైటీపై సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని.. కాబట్టి సొసైటీలో ఉంటున్న తనకీ ఓ మంచి నాయకుడ్ని ఎన్నుకునే బాధ్యత ఉందని.. కాబట్టి తాను చెప్తే వినేవాళ్లు ఉండటం తన అదృష్టం అని అన్నారు అనసూయ. తాజా ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడుతూ.. 'ఇది వివాదం అవ్వొచ్చు కానీ.. అడిగారు కాబట్టి చెప్తున్నా. నేను తప్పై ఉండొచ్చు. నాకు లీడర్స్‌తోనే పని. పొలిటికల్ పార్టీలతో కాదు. పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడు. ఆయన ప్రచారం చేయమని పిలిస్తే తప్పకుండా వెళ్తాను. జబర్దస్త్‌లో రోజా, నాగబాబు ఇద్దరితో కలిసి పనిచేశాను. నాకు నాగబాబు గారు బాగా క్లోజ్. ఒకవేళ అటు నుంచి రోజా గారూ.. ఇటు నుంచి నాగబాబు గారూ పార్టీలోకి పిలిస్తే.. నాకు నాయకులతోనే పని. పార్టీలతో పని కాదు. నాకు చాలా పార్టీల నుంచి చాలామంది లీడర్లు తెలుసు. వాళ్లని అభిమానిస్తాను. వాళ్లు ఇద్దరూ పిలుపునిస్తే.. ఆ రెండు పార్టీల్లోకి వెళ్తాను. అది నా ఆసక్తికిని బట్టి ఉంటుంది. కానీ అది నా జాబ్ కాదు. నేను ఏది నమ్ముతానంటే.. నా అజెండాని బట్టి నేను సపోర్ట్ చేస్తాను.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.